పేటేరులో అభివృద్ధి వెలుగులు

- గ్రామంలో రూ.48.61 కోట్లతో అభివృద్ధి పనులు
- ఆధునిక సొబగులతో ప్రభుత్వ కార్యాలయ భవనాలు
- వైఎస్సార్ సీపీ పాలనలో సమకూరిన మౌలిక వసతులు
- జగనన్న పాలనపై హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




పేటేరులో అన్ని హంగులతో నిర్మితమైన రైతు భరోసా కేంద్రం

రేపల్లె రూరల్: మండలంలోని మేజర్ పంచాయతీ పేటేరు అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందుతాయనటానికి నిదర్శనంగా రేపల్లె మండలం పేటేరు గ్రామం నిలుస్తోంది. జగనన్న ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి గతంలో ఎన్నడు లేని విధంగా పంచాయతీ అభివృద్ధి పథంలో పయనిస్తూ ఆదర్శ గ్రామంగా నిలుస్తోంది. పదివేల మంది జనాభా, 3 వేల పైచిలుకు గృహాలు ఉన్న గ్రామంలో ఈ ఐదేళ్ల కాలంలో గతంలో ఎన్నడు లేని విధంగా రూ.48.61 కోట్లతో అభివృద్ధి, సంక్షేమంతో ఆదర్శనీయంగా రూపుదిద్దుకుంది. నవరత్న పథకాలతో గ్రామంలోని లబ్ధిదారులకు వివిధ పథకాల రూపంలో రూ.44 కోట్ల రూపాయలు వారి బ్యాంకు ఖాతాలో జమ అవ్వటం జగనన్న పారదర్శక పాలనకు అద్దం పడుతుంది.

రూ.4.60 కోట్లతో అభివృద్ధి పనులు

వైఎస్సార్ సీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నట్లుగా గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తయ్యాయి. ఇంటింటికి రూ.1.20 కోట్లతో జల్‌జీవన్ మిషన్ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామి కాలనీలో రూ.3లక్షల వ్యయంతో తాగునీటి పథకం ఏర్పాటు చేశారు. నాడు-నేడు పథకం ఫేజ్-1, ఫేజ్-2లో రూ.1.50 కోట్లతో జడ్పీ హైస్కూలు, ఎంపీపీ పాఠశాలల అభివృద్ధి చేసి ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. దీంతో జడ్పీ హైస్కూలులో గతంలో కంటే మిన్నగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. గ్రామ స్థాయిలోనే ప్రభుత్వ సేవలు అందించాలన్న లక్ష్యంతో గ్రామంలో రెండు సచివాలయాలు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఇప్పటికే రూ.40 లక్షల వ్యయంతో పేటేరు-1 సచివాలయ భవనంను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. మరో రూ.40 లక్షల వ్యయంతో సచివాలయ భవనం-2 నిర్మాణం తుది దశకు చేరుకుంది. రూ.40 లక్షల వ్యయంతో చేనేత కార్మికుల కోసం కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను నిర్మించారు. రూ.18 లక్షల వ్యయంతో రైతు భరోసా కేంద్రాన్ని పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. రూ.3 లక్షలతో ఆరోగ్య ఉపకేంద్రాన్ని మరమ్మతులు నిర్వహించి ఆదర్శనీయంగా తీర్చిదిద్దారు. రూ.23 లక్షలతో నిర్మించబడుతున్న ఆరోగ్య ఉప కేంద్ర భవనం పనులు తుదిదశకు చేరాయి. పంచాయతీలోని వివిధ వార్డులలో రూ.60 లక్షలతో సీసీ రోడ్డుల నిర్మాణాలు పూర్తయ్యాయి. అర్హతే ప్రామాణికంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి చేరుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో గ్రామంలో 715 మందికి పింఛన్‌లు ఉండగా జగనన్న ప్రభుత్వం వచ్చాక 1030 మందికి పింఛన్‌లు అందిస్తున్నారు.


గ్రామంలో రూపుదిద్దుకున్న రహదారి


ఆధునిక వసతులతో నిర్మించిన పేటేరు సచివాలయం

జగనన్న పాలనలో ఊరు బాగుపడింది



జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనా కాలంలో మా గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, ఆధునిక హంగులతో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, రహదారుల నిర్మాణాలతో గ్రామం అభివృద్ధి చెందిందనటంతో ఏ మాత్రం సందేహంలేదు. గతంలో గ్రామాల అభివృద్ధి పట్టించుకున్న నాధుడే లేడు. జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టాక గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి అభివృద్ధి చేయటంతో బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి పునాదులు పడ్డాయి.

-జీ.లక్ష్మణరావు, పేటేరు

వలంటీర్ల సేవలు మరువలేము



గతంలో గ్రామంలో అంతర్గత రహదారులు అంతంత మాత్రంగా ఉండేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మా గ్రామంలో పలు ప్రాంతాలలో అంతర్గత రహదారులు ఏర్పాడ్డాయి. సచివాలయాలు వచ్చాక గ్రామంలోనే ప్రభుత్వ సేవలను క్షణాల్లో పొందుతున్నాం. గతంలో పింఛన్‌ల కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల కొద్ది వేచి ఉండాల్సిన పరిస్థితి ఉండేది. వలంటీర్ల రాకతో ఆ బాధలు తప్పాయి. ప్రతి నెల 1న పింఛన్‌ను ఇంటికి తీసుకువచ్చి ఇస్తున్నారు.

- రంగా సాంబయ్య, పేటేరు.

క్లుప్తంగా

గ్రామాల్లో జోరుగా ప్రచారం

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ నాయకుల ప్రచారం జోరుగా కొనసాగుతోంది. మండల కేంద్రమైన భట్టిప్రోలుతో పాటు గ్రామాల్లో కార్యకర్తలతో కలసి నాయకులు ఇంటింటికి వెళ్లి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు వరికూటి అశోక్ బాబు, నందిగం సురేష్‌లను గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు.అమలు చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విన్నవిస్తున్నారు. భట్టిప్రోలు మండల సోషల్ మీడియా కన్వీనర్ రెబ్బా మున్ని ఆధ్వర్యంలో ఆళ్లమూడిలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పెద్దిశెట్టి వెంకటేశ్వరరావు, యేపూరి నాగు, పంతగాని బాలసుబ్రహ్మణ్యం, కనపర్తి నాగయ్య పాల్గొన్నారు. అమృతలూరులో రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ షేక్ ఇమామ్ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



చావలి(వేమూరు): వేమూరు మండలం చావలి గ్రామంలోని దళితవాడకు చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు 10 కుటుంబాల వారు శుక్రవారం అమర్తలూరు మండలంలోని కూచిపూడి వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వరికూటి అశోక్‌బాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. తెలుగుదేశం నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన కార్యకర్తలకు సముచితం స్థానం కల్పించడం జరుగుతుందని అశోక్‌బాబు తెలిపారు.

జోరుగా వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం



రేపల్లె రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. రేపల్లె పట్టణం, మండలంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించి వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని ప్రజలను కోరారు. శుక్రవారం రేపల్లె పట్టణంలోని 17వ వార్డులో వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి పట్టెం శ్రీనివాసరావు, కౌన్సిలర్ ఆకురాతి గంగమ్మ, మండలంలోని మోర్తోట, నల్లూరుపాలెం, జంగాలవారిపాలెం తదితర గ్రామాలలో నాయీ బ్రాహ్మణ నాయకులు వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ బాపట్ల పార్లమెంటరీ అభ్యర్థి నందిగం సురేష్, రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరు గణేష్‌లకు ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

దూరవిద్య డిగ్రీ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

గుంటూరు ఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ దూరవిద్య డిగ్రీ నాలుగు, ఆరో సెమిస్టర్ పరీక్షల ఫీజుల చెల్లించేందుకు ఈనెల 31 వరకు అవకాశ ఉందని జేకేసీ కళాశాల క్యాంపస్‌లోని వర్సిటీ అధ్యయన కేంద్రం ప్రాంతీయ సమన్వయకర్త పి.గోపీచంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా యూజీ ప్రథమ సంవత్సర ఫస్ట్ సెమిస్టర్ పరీక్ష ఫీజును రూ.500 అపరాధ రుసుంతో ఈనెల 14, రూ.వెయ్యి అపరాధ రుసుంతో ఈనెల 22లోగా చెల్లించాలని సూచించారు. పరీక్ష ఫీజులను యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డు ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయాలని కోరారు. వివరాలకు 0863-2227950, 73829 29605 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్‌వీఎన్ కాలనీలో నివాసం ఉండే బత్తుల ప్రభురాజ్‌కుమార్(18) ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయ్యాడు. మానసికంగా కుంగిపోయి శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై పటిష్ట చర్యలు

బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా

భట్టిప్రోలు: కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా సూచించారు. భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్ లోని పోలింగ్ కేంద్రాలను, విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత ఏర్పాట్లపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పటిష్టంగా ఉండాలని, అలాగే బందోబస్తు కూడా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. సీసీ కెమేరాల పర్యవేక్షణలో నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. భట్టిప్రోలు హైస్కూల్‌లోని సమస్యాత్మకమైన 214వ పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ తప్పని సరిగా ఏర్పాటు చేయాలని తెలిపారు. అలాంటి కేంద్రాలకు సూక్ష్మ పరిశీలకులను నియమించామన్నారు. వేమూరు నియోజకవర్గ పరిధిలో 42 ప్రాంతాల్లో 45 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతా బలగాలను నియమించడం జరిగిందన్నారు. ఓటర్లంతా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకునే వాతావరణం కల్పించామని పేర్కొన్నారు. ఆయన వెంట వేమూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కేవీ వసంతరాయుడు, తహసీల్దార్ ఐ.మునిలక్ష్మి, ట్రైనీ డీఎస్పీ విద్యశ్రీ,, సీఐ రామకృష్ణ, కొల్లూరు ఎస్ఐ రవీంద్రరెడ్డి, ఎంఈవో నీలం దేవరాజు, రెవిన్యూ, పోలీస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


భట్టిప్రోలులో స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న రంజిత్ భాషా, వసంతరాయుడు

మద్యం సీసాలు స్వాధీనం



కర్లపాలెం: ఓటర్లకు పంచేందుకు సిద్ధంగా ఉంచిన మద్యం బాటిళ్లను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల పరిధిలోని బిడారుదిబ్బ గ్రామంలో చోటు చేసుకుంది. కర్లపాలెం ఎస్ఐ జనార్దన్ తెలిపిన వివరాల మేరకు యాజలి సెంటర్‌లోని బిడారుదిబ్బ గ్రామంలో మందపాటి కోటయ్య వరిగడ్డి వాము దగ్గర మందు బాటిళ్లు దాచారని అందిన సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 114 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం బాటిళ్లతో పాటు తెలుగుదేశం పార్టీ బాపట్ల అసెంబ్లీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఫోటో ఉన్న సంచిలో నిత్యావసర సరకులు దొరికాయని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి జె.వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

కోనేటిపురంలో వరికూటి ఎన్నికల ప్రచారం

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కోనేటిపురం పంచాయతీ పరిధిలోని జంపనివారిపాలెం, పడమటివారిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు శుక్రవారం రాత్రి పార్టీ శ్రేణులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగున ప్రజలు అశోక్‌బాబుకు ఘన స్వాగతం పలికారు. గ్రామ సర్పంచ్ మోర్ల వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ మల్లోలు ఉషారాణి, మహిళలు హారతులు పట్టారు. ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందాలని ఆకాంక్షించారు.


కోనేటిపురం ఎన్నికల ప్రచారంలో అశోక్‌బాబుకు హారతిస్తున్న మహిళలు

మోదుగుల ఆదిలక్ష్మికి అంతిమ వీడ్కోలు

గుంటూరు రూరల్: మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి తల్లి ఆదిలక్ష్మి అంతిమ వీడ్కోలు శుక్రవారం ఉదయం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని రెడ్డిపాలెంలో నిర్వహించారు. కుమారులు మోదుగుల వాసుదేవరెడ్డి, మోదుగుల వేణుగోపాలరెడ్డి కార్యక్రమాలు నిర్వహించారు. అంతిమ యాత్రలో రాజ్యసభ సభ్యుడు దంపతులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, దాక్షాయణి, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. తొలుత ఆదిలక్ష్మి చిత్రపటానికి పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి మాట్లాడుతూ ఆదిలక్ష్మి, పాపిరెడ్డి దంపతులు ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ప్రతి ఒక్కరికి మార్గదర్శకులని పేర్కొన్నారు. మాజీ ఎంపీ మోదుగుల మాట్లాడుతూ తల్లి ఆశీస్సులు ఎల్లపుడూ తమపై ఉండాలని ఆకాంక్షించారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు కళలు దోహదం

నగరంపాలెం: ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 22 మంది నాట్యాచార్యులు, వారి శిష్యులైన సుమారు 240 కళాకారులు ఒక చోటకు చేరారు. ఉదయం, సాయంత్రం వేళల్లో వారు ప్రదర్శిస్తున్న నృత్యాలకు బృందావన్‌గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలోని పద్మావతి కళావేదిక, అన్నమయ్య కళావేదిక, వేదికగా మారాయి. భరతముని కూచిపూడి నృత్య కళాక్షేత్రం నిర్వహణలో సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్స్ సౌజన్యంతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న అయోధ్య రామ ఉత్సవ్- 2024 రామ్ లల్లా పురస్కార నృత్యోత్సవం శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ నాట్యాచారిణి వి.రంగమణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి సీనియర్ నాట్యగురువు కృష్ణకుమారి మాట్లాడుతూ దేశ సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేందుకు కళలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. భారతదేశం కళలకు కాణాచి అని తెలిపారు. అందులో నాట్యం ప్రాధాన్యం వహించిందని చెప్పారు, కూచిపూడి నత్యానికి ఆంధ్ర రాష్ట్రం పుట్టినిల్లు అని పేర్కొన్నారు. ఎందరో కళాకారులు, కూచిపూడి నృత్యాన్ని దేశ, విదేశాలలో ఖ్యాతి తెచ్చినట్లు కొనియాడారు. హిందూ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో కూచిపూడి మరింత వెలుగులోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనికై నాట్యాచార్యులు, తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించే దిశగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.


కళాకారులతో అతిథులు

ఆర్‌వీఆర్‌జేసీలో జాతీయ సాంకేతిక దినోత్సవం



గుంటూరు రూరల్: ఆర్‌వీఆర్ జేసీలో జాతీయ సాంకేతిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్ మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల అద్భుత సేవలను స్మరించుకోవడం ప్రతి విద్యార్థి బాధ్యతన్నారు. అనంతరం క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలను అందజేశారు. జాతీయ స్థాయిలో జరిగిన ప్రాటోటైప్, హ్యాకథాన్, పోటీలలో విజయాలు సాధించిన కళాశాల విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కె కృష్ణప్రసాద్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె ప్రవీణ్, డాక్టర్ కె శోభ, డాక్టర్ ఎస్ ధరణికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బంగారు బాపట్ల సాకారం దిశగా అడుగులు

- అధికారంలోకి వస్తే రానున్న ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్ ఆశీస్సులతో మరింత అభివృద్ధి
- సాక్షితో ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే కోన రఘుపతి



బాపట్ల: ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే బాపట్ల జిల్లా కేంద్రంగా మారడంలో ఎమ్మెల్యే కోన రఘుపతి చేసిన కృషి మరువలేనిది. బాపట్ల జిల్లా కేంద్రంగా అవతరించటంతో పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందింది. రఘుపతి కార్యదక్షతను గుర్తించిన పట్టణ ప్రజలు ఇప్పటికే రెండు పర్యాయాలు ఆయనను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకముంచి మూడో సారి ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో భారీ మెజారిటీతో గెలుపొందుతానని చెబుతున్న కోనతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: మీది రాజకీయ కుటుంబం..వారి అనుభవం మీ గెలుపునకు ఏవిధంగా దోహదపడుతుందని భావిస్తున్నారు?

జవాబు: మా నాన్నగారు కోన ప్రభాకరరావు బాపట్ల నియోజకవర్గానికి తాగునీరు, సాగునీరు అందించటంతో పాటు రాజకీయాలకు ఒక కొత్త నిర్వచనం చెప్పారు. ఆయన తనయుడునైన నాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు సార్లు టిక్కెట్ ఇవ్వటం బాపట్ల అభివృద్ధిపై నా బాధ్యతను మరింత పెంచింది.

ప్రశ్న: మీరు గెలిస్తే ఏమి చేస్తారు?

జవాబు: బాపట్ల నియోజకవర్గంలో ఉపాధి కల్పనకు పెద్ద పీట వేస్తాను. మరో వైపు పర్యాటక కేంద్రంగా సూర్యలంకతో పాటు పలు బీచ్‌లను అభివృద్ధి చేసూకుంటూ పోతున్నాం. జిల్లా కేంద్రంగా మార్చుకోవటంతో పాటు ఒక పక్క మెడికల్ కళాశాల, మరోవైపు రోడ్ల విస్తరణపై దృష్టి సారించాను. వీటిని పూర్తి చేయటంతో పాటు మరెన్నో ప్రతిపాదనలతో ముందుకు పోతున్నాం. బాపట్ల నియోజకవర్గాన్ని టెంపుల్ టౌన్‌గా చేస్తానని ఆనాడే చెప్పాను.ఇందులో భాగంగా సీబీజెడ్ చర్చి, మసీదు, శ్రీభావన్నారాయణ స్వామి దేవాలయం, ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం అభివృద్ధికి చర్యలు చేపట్టాం.

ప్రశ్న: ప్రచారంలో మీరు ప్రజల నుంచి ఎదుర్కొన్న సమస్య లేమిటి?

జవాబు: ప్రచారంలో ప్రజలు అంతర్గత రోడ్ల నిర్మాణాలను నా దృష్టికి తెచ్చారు. కొన్ని గ్రామాల్లో కొద్దిపాటి తాగునీటి సమస్యలు ఉన్నట్లు చెప్పారు. వాటికి ఇప్పటికే ప్రతిపాదనలు పంపటం జరిగింది. బాపట్ల పట్టణంలో శాశ్వత మంచి నీటి పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాం. కచ్చితంగా మళ్లీ అధికారంలోకి వచ్చి వీటి పరిష్కారానికి కృషి చేస్తాను.

సీఎం వైఎస్ జగన్ పాలనలో బీసీలకు న్యాయం

- రేపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం
- సాక్షితో ఇంటర్వ్యూలో వైఎస్సార్ సీపీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్



రేపల్లె రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తోంది. నామినేటెడ్ పదవుల నుంచి ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రుల వరకు బీసీలకు ప్రాధాన్యత కల్పిస్తూ వారికి సమాజంలో సముచిత స్థానం, గౌరవం కల్పిస్తోంది. గతంలో అనేక రాజకీయ పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వినియోగించుకుంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సామాజిక వర్గాల అభివృద్ధే ధ్యేయంగా అనేక పథకాలను అమలు చేయటంతో పాటు శాసనసభ నుంచి రాజ్యసభ వరకు బీసీలను పంపి వారిపై తనకున్న ప్రేమను చాటుకున్నారు. బీసీలకు బ్యాక్ బోన్‌గా నిలిచి రేపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థిగా బీసీ గౌడ సామాజికవర్గానికి చెందిన డాక్టర్ ఈవూరు గణేష్‌కు సీటు కేటాయించారు. సాక్షికి ఇచ్చిన ఇంటర్వ్యూలో గణేష్ పలు అంశాలను పంచుకున్నారు.

ప్రశ్న: వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేయటం మీకు ఎలా అనిపిస్తోంది?

జవాబు: పేదల పార్టీగా పేరొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరుపున రేపల్లె నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేయటం చాలా సంతోషంగా ఉంది.

ప్రశ్న: మీ ప్రత్యర్థి ఇక్కడ వరుసగా రెండు సార్లు గెలుపొందారు. హ్యాట్రిక్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మీరేమంటారు?

జవాబు: ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందినా నియోజకవర్గానికి, ప్రజలకు చేసింది శూన్యం. గత ఐదేళ్ల నుంచి నియోజకవర్గంలో ఎమ్మెల్యే అందుబాటులో ఉన్నది కూడా లేదు. అప్పుడప్పుడు అతిథిగా వచ్చి వెళ్లటం తప్ప ప్రజా సమస్యలపై దృష్టి సారించలేకపోయారు. ఈ సారి రేపల్లెలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేయటం ఖాయం.

ప్రశ్న: మీ గెలుపుకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి ఏ మేర సహకరిస్తున్నారు?

జవాబు: రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు సహకారం మరువలేను. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు నాయకులను సమన్వయం చేస్తూ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

ప్రశ్న: మీ కుటుంబ రాజకీయ నేపథ్యం ఎంత వరకు కలిసి వస్తుందంటారు?

జవాబు: మా అమ్మ సీతారావమ్మ, నాన్న సుబ్బారావులు కూచినపూడి నియోజకవర్గంకు శాసన సభ్యులుగా పనిచేసిన అనుభవం నాకు ఎంతగానో ఉపకరిస్తోంది. గత ఐదేళ్లలో జగనన్న పాలనలో ప్రతి ఒక్క కుటుంబానికి రూ.1 లక్ష నుంచి రూ.3 లక్షలకు పైగా లబ్ధి చేకూరింది. మండలాలలో పర్యటిస్తున్నప్పుడు ప్రతి ఒక్కరూ సంతోషంగా ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. జగనన్న పాలనా సంస్కరణలు, సంక్షేమ ఫలాలు, అభివృద్ధి నా విజయానికి దోహదం చేస్తాయని నమ్ముతున్నాను.

ప్రశ్న: నియోజకవర్గ పర్యటనలో మీ దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలు?

జవాబు: నియోజకవర్గంలో రహదారులు, తాగునీటి సమస్యలను గుర్తించటం జరిగింది. ప్రజలు ఆశీర్వదించి అసెంబ్లీకి పంపిస్తే నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయటంతో పాటు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తాను.

వేమూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

- అధికారంలోకి వచ్చాక వేమూరును ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- సాక్షి ఇంటర్వ్యూలో వరికూటి అశోక్‌బాబు



వేమూరు: వరికూటి అశోక్ బాబు రాకతో వేమూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ క్యాడర్‌లో నూతనోత్సాహం చిగురించింది. ఆయనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించిన నాటి నుంచి నిత్యం జనంలో ఉంటూ సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచి వేమూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేస్తున్న అశోక్‌బాబుతో సాక్షి ప్రత్యేక ఇంటర్వ్యూ..

ప్రశ్న: ప్రభుత్వ సంక్షేమ పథకాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారా ?

జవాబు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఎలాంటి అవినీతి లేకుండా అమలు చేశారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమం బహుశా దేశంలో మరెక్కడా లేదంటే అతిశయోక్తి కాదు. కచ్చితంగా ఆ పథకాలే పార్టీ అభ్యర్థుల విజయంలో ప్రముఖ పాత్ర పోషిస్తాయనేది నా నామ్మకం

ప్రశ్న: చంద్రబాబు మేనిఫెస్టోపై మీ అభిప్రాయం?

జవాబు: చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో భూటకమని అందరికి తెలుసు. కూటమిని నమ్మే స్థితిలో ప్రజలు లేరు. చంద్రబాబు గత వాగ్దానాలు ఏమేరకు అమలు చేశారో అందరికీ తెలుసు.

ప్రశ్న: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో ఎలాంటి మార్పులు లేవు ఎందుకని?

జవాబు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాధ్యమైన వాటినే మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగింది. సత్యదూరమైన వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేయటం కన్నా ఆచరణ సాధ్యమైనవి ప్రకటించటమే మంచిదని నా అభిప్రాయం.

ప్రశ్న: ఎన్నికల ప్రచారంలో ఎలాంటి స్పందన వస్తుంది?

జవాబు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల కారణంగా ఏ గ్రామానికి పోయినా అక్కడి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సీఎం జగన్ పాలనపై ప్రజల్లో ఎలాంటి భావన ఉందో నాకు ఇప్పుడు అవగతమైంది. కచ్చితంగా రానున్న ఎన్నికల్లో ఆయన ఆశీస్సులతో విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నాం.